## ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

* కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రిక కు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను
* బాన్సువాడ టౌన్, కామారెడ్డి టౌన్, కామారెడ్డి ఆర్సి, బిచ్కుంద, బీర్కూర్, తాడ్వాయి, లింగంపేట, నస్రుల్లాబాద్, మండలాలకు రిపోర్టర్లు కావలెను
* కనీస విద్యార్హత ఉంటే సరిపోతుంది. మిగతా వివరాలకు

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

**96665 56646**



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## నిజామాబాద్ కామారెడ్డి

గురువారం, జనవరి 8, 2026 పేజీలు: 8




# బోధన్ మండలంలో ఇసుక అక్రమ రవాణా



బోధన్ జనవరి 07 (ప్రజాజ్యోతి) నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పరిధిలో ఇసుక అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతోందన్న ఆరోపణలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి. సాలురా మండలం మంధర్నా, పోతాంగల్ మండలం సుంకిని ప్రాంతాల నుంచి బోధన్ వైపు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు ప్రతిరోజూ ఉదయం వేళల్లో పెంట గ్రామం మార్గంగా -మిగతా 2లో..

# సిరికొండలో చిరుత దాడి

## లేగ దూడ మృతి- సుమారు రూ.30 వేల నష్టం



2 లో

## మధ్యాహ్న భోజనంపై

# ఆర్డీవో విచారణ



నాగిరెడ్డిపేట్,జనవరి 7(ప్రజాజ్యోతి): నాగిరెడ్డిపేట్ మండలంలోని మాల్తుమ్మెద బాలురు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజనం వికటించి 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో బుధవారం -మిగతా 2లో..

# కేజీబీవీలో సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



8 లో

# బోధన్ మండలంలో ఇసుక అక్రమ రవాణా

ప్రవేశిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అక్రమ రవాణా జరుగుతున్న మార్గంలో పోలీసు వాహనాలు గస్తీ కాస్తున్నప్పటికీ, ఇసుక ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రాక్టర్లు వెళ్లే ముందే అదే దారిలో పోలీసుల కదలికలు కనిపిస్తున్నాయని, ఈ వ్యవహారంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనిస్తే ఇసుక అక్రమ రవాణాకు రూరల్ పోలీసుల సహకారం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి వ్యవహార శైలిపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. గతంలోనూ ఇలాంటి ఆరోపణలు వచ్చాయని, అయినా ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. రాష్ట్ర స్థాయిలో పలుమార్లు అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయాలంటూ ఆదేశాలు వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు రాజకీయ మద్దతు ఉందన్న అనుమానాలను కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు వెలికితీయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బోధన్ మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సిరికొండలో చిరుత దాడి

**నిజామాబాద్ రూరల్: జనవరి, 7 (ప్రజా జ్యోతి)**

సిరికొండ మండలంలో చిరుత పులి దాడి కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో, గోప్య నాయక్ తండకు చెందిన మాలవత్ రఘుపతికి చెందిన లేగ దూడను చిరుత పులి దాడి చేసి చంపిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన సిరిసిల్ల రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని తిరుపతి గుట్ట బీట్, కంపార్ట్మెంట్ నెంబర్ఉ500లో జరిగినట్లు అటవీ అధికారులు తెలిపారు.

సమాచారం అందుకున్న అటవీ అధికారులు బుధవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సిరికొండ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ లేగ దూడకు పోస్టుమార్టం నిర్వహించారు. చనిపోయిన లేగ దూడ విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని డాక్టర్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా సిరికొండ ఇన్‌చార్జి రేంజ్ అధికారి బి. రవీందర్ మాట్లాడుతూ చనిపోయిన లేగ దూడ యజమానికి అటవీ శాఖ ద్వారా నష్టపరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు. అడవికి సమీప గ్రామాల్లో ఎక్కడైనా పశువులుఉఆవులు, దూడలు, లేగలు, మేకలుఉవన్యప్రాణుల దాడిలో



చనిపోతే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలా చేస్తే శాఖ ద్వారా నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు.

అదేవిధంగా అడవి జంతువులకు ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం లభిస్తే అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చనిపోయిన పశువుల కళేబరంపై విష ప్రయోగాలు చేసినా లేదా వన్యప్రాణులకు హాని కలిగించినా వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని రేంజ్ అధికారి బి. రవీందర్ స్పష్టం చేశారు.

కావాలంటే దీనిని ఇంకా సంక్షప్తంగా లేదా

# మధ్యాహ్న భోజనంపై ఆర్డీవో విచారణ





ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి పాఠశాలలో విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల తల్లిదండ్రులతో,గ్రామస్తులతో విచారణ జరిపారు.అస్వస్థకు గురై చికిత్స పొంది కోలుకొని పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు.పాఠశాలలోని పరిసరాలతో పాటు వంట గదిని పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వంట చేస్తున్న నీరు కలుషితమవుతున్నాయని మధ్యాహ్న భోజన ఏజెన్సీని మార్చాలని గ్రామస్తులు ఆర్డీవోను కోరారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు ఆర్డీవో ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, గ్రామ సర్పంచ్ సాయిలు,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసి,గ్రామస్తులు పాల్గొన్నారు.

## జానకంపేటలో రోడ్డు ప్రమాదం.. కారును ఢీకొన్న ఇసుక టిప్పర్.



**బోధన్ జనవరి 07 (ప్రజాజ్యోతి)**

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట గ్రామంలోని గాంధీ చౌరస్తా వద్ద బుధవారం తీవ్ర రోడ్డు ప్రమాదం జరిగింది. నవీపేట వైపు నుంచి వస్తున్న కారును అధిక లోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్ ఢీకొనడంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా, స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఎడపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఇసుక టిప్పర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఎడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అధిక లోడుతో వాహనం నడిపిన అంశంపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటనతో కొద్దిసేపు గాంధీ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సంజాయిషీ నోటీస్

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 7**






బీబీపేట మండల కేంద్రంలో గల జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యార్థిని సమన్విత తండ్రి బాబు బుధవారం రోజున పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం యాజమాన్యం వద్దకు వెళ్లి అక్కడ పరిశీలించగా మధ్యాహ్న భోజనం లో వంటకు కోసిన బంగాళదుంపలను పరిశీలించగా అవి కుళ్ళిపోయిన బంగాళదుంపలు అయి ఉన్నాయి అని విద్యార్థిని తండ్రి ప్రధానోపాధ్యాయులు ను అడగగా వెంటనే స్పందించి ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన యాజమాన్యంను అడిగి యాజమాన్యంకు సంజాయిషీ నోటీసు జారీ చేయడం జరిగింది.

## విరిగిన విద్యుత్ స్తంభంపై అధికారుల నిర్లక్ష్యం.

**బోధన్ జనవరి 07 (ప్రజాజ్యోతి)**

బోధన్ పట్టణంలోని తట్టికోట్ గల్లీ, 37వ వార్డు మరియమ్మ గుడి సమీపంలో నివాసాల మధ్య ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. విరిగిన స్థితిలో ఉన్న ఈ స్తంభాన్ని మరమ్మతు చేయాలంటూ స్థానికులు గత ఐదు నెలలుగా విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు. నివాస ప్రాంతంలోనే స్తంభం ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నుంచి హామీలే తప్ప కార్యాచరణ లేకపోవడంతో ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విరిగిన విద్యుత్ స్తంభాన్ని వెంటనే సరిచేయాలని కాలనీ వాసులు శ్రీకాంత్, దర్శనం సాయిలు, మర్రయ సుధాకర్ తదితరులు డిమాండ్ చేశారు.



# విద్యార్థులు మానసిక అవరోధాలను అధిగమించాలి

## జిల్లా మానసిక డాక్టర్ రమణ





**రామారెడ్డి జనవరి 07 (ప్రజా జ్యోతి)**

విద్యార్థులు మానసిక అవరోధాలను అధిగమించాలి అని జిల్లా మానసిక వైద్యాధికారి డా. రమణ బుధవారంరామారెడ్డి మండలం ఉప్పల్వాయి బాలుర గురుకుల పాఠశాలలో మానసిక సమస్యలు, పరీక్ష కాలంలో విద్యార్థులు వ్యవహరించాల్సిన తీరు పై, మాదక ద్రవ్యాల నియంత్రణ పై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మానసిక వైద్యాధికారి డా రమణ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలని, టీనేజ్ వయసులో వచ్చి మానసిక అవరోధాలను అధిగమించాలని, అప్పుడే అనుకున్న లక్ష్యలను సాధించవచ్చని తెలిపారు. టీనేజి కాలంలో వయసు రీత్యా ఆకర్షణకు లోనవడం, చదువు పై దృష్టి సారించకుండా చెడు వ్యసనాలకు లోనవడం జరుగుతుందని వివరించారు. ప్రణాళికాబద్ధంగా పరీక్ష కాలంలో ప్రిపేర్ అవ్వాలని, మానసికంగా ఎటువంటి ఒత్తిడిని పెట్టుకోవద్దని తెలిపారు. మొబైల్ వాడకానికి దూరంగా ఉండాలని, కేవలం కమ్యూనికేషన్ కొరకే ఉపయోగించుకోవాలని, సోషల్ మీడియా మోజులో పడి బంగారు భవిష్యత్తును కోల్పోవద్దు విద్యార్థులు ముఖ్యంగా టీనేజీ వయసున్న పిల్లలు మత్తుపదార్థాలకు లోనయ్యి,తమ విలువైన జీవితాలను వృధా చేసుకుంటున్నారని,తమ కుటుంబసభ్యులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. కుటుంబాన్ని, సమాజాన్ని కాపాడాల్సిందే యువత అని అందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని విద్యార్థులకు తెలిపారు. మాదక ద్రవ్యాల నిరోధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఉన్నత లక్ష్యలను చేరుకొని తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని, విద్య పట్ల ఎటువంటి సందేహాలున్న తమ ఉపాధ్యాయులను సంప్రదించాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తితే తమను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.సురేష్, వైస్ ప్రిన్సిపల్ మోహన్, ఎం ఎల్ హెచ్ పి డా.రమ్యశ్రీ, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం







**బాన్సువాడ ఆర్సి, జనవరి 07 (ప్రజా జ్యోతి)**

బాన్సువాడ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (కో ఎడ్యుకేషన్) వార్షికోత్సవం మరియు క్రీడోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని, విద్యార్థులకు పోచారం శ్రీనివాసరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. క్రీడలతో పాటు చదువులో కూడా ముందుండాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షంచారు. అనంతరం విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ అలరించాయి. విద్యార్థుల ప్రతిభకు అతిథులు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, బాన్సువాడ పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినిఉవిద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## కళ్యాణ లక్ష్మ షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి

**బాన్సువాడ ఆర్ సి జనవరి 07 (ప్రజా జ్యోతి)**

బాన్సువాడ నియోజక వర్గంలోని పోతంగల్ , కోటగిరి మండలాల కల్యాణలక్ష్మ,షాది ముబారక్ 131 మంది లబ్ధిదారులకు 1,31,25,196/- రూపాయల చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ నియోజక వర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు బాన్సువాడ నియోజక వర్గం కోటగిరి మండలం లో 39 మందికి కల్యాణలక్ష్మ, షాది ముబారక్ లబ్ధిదారులకు మొత్తం 39,04,524/- రూపాయల చెక్కులను పంపిణీ చేశారుబాన్సువాడ నియోజక వర్గం లోని పోతంగల్ మండలం 92 మంది కల్యాణలక్ష్మ, షాది ముబారక్ లబ్ధిదారులకు 92,10,672/- రూపాయల చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మరియు పోతంగల్ మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.



# డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

**రాజంపేట జనవరి 7 (ప్రజా జ్యోతి)**

రాజంపేట మండల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సంతోషిని బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను బిక్కనూర్ మండలానికి బదిలీ చేశారు. అదే సమయంలో బీబీపేట మండలం నుంచి డిప్యూటీ తహశీల్దార్ శృతిని రాజంపేటకు నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ బదిలీలతో రాజంపేట తహశీల్దార్ కార్యాలయంలో పరిపాలనా మార్పులు చోటు చేసుకున్నాయి. కొత్త అధికారుల నియామకంతో కార్యాలయ పనితీరు మరింత మెరుగుపడి, భూ సంబంధిత సేవలు, ధ్రువపత్రాల జారీతో పాటు ఇతర రెవెన్యూ పనులు సత్వరంగా జరుగుతాయనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

## తహసిల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న సవాయిసింగ్



**బాన్సువాడ ఆర్ సి జనవరి 07 (ప్రజా జ్యోతి)**

బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూరు మండల తహసీల్దారుగా సవాయ్ సింగ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా మండల యువజన అధ్యక్షులు యూత్ ఐకాన్ మియాపురం శశికాంత్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఇక్కడ విధులు నిర్వహించిన సాయి భుజంగారావు నిజాంసాగర్ కు బదిలీ కాగా కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్ వన్ ఆదేశాల మేరకు బుధవారము బీర్కూరు తాసిల్దార్ గా సవాయ్ సింగ్ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా బీర్కూరు గ్రామస్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం రైతులకు గ్రామస్తులకు నాయకులకు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి ఏ సమస్యలు ఉన్న పరిష్కరిస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పరమేష్ పంతులు ,విట్టాల్, అవారీ గంగారాం, ప్రశాంత్ ,బీర్కుర్ ఏఎంసీ ఉపాధ్యక్షులు యమ పెద్ద రాములు, మాజీ ఎంపీటీసీ సందీప్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# సర్పంచ్ దేవి సింగ్‌ని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**బాన్స్వాడ బీర్కూర్ ఆర్ సి జనవరి 07( ప్రజా జ్యోతి)**

బీర్కూరు మండలంలోని బీర్కూర్ తాండ సర్పంచిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కాట్రోత్ దేవ్ సింగ్ కు బీర్కూరు మండల యువజన నాయకుడు యూత్ ఐకాన్ మియాపూర్ శశికాంత్ తన స్వగృహంలో ఘనంగా శాలువతో సన్మానించారు .దేవి సింగ్ సర్పంచ్ గా బాధ్యతలు తీసుకున్న వెంటనే గ్రామ అభివృద్ధి కొరకు గ్రామాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకు వెళ్తున్నారని ఆయన పనిని గుర్తించి ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు మియాపురం శశికాంత్ తెలిపారు. ఈ సందర్భంగా శశికాంత్ మాట్లాడుతూ సర్పంచ్ గ్రామానికి ప్రథమ పౌరుడు అని ఈ అవకాశము అందరికీ రాదని వచ్చిన వారు దానిని సద్వినియోగం చేసుకొని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పైన దృష్టి సారించి ప్రభుత్వం ద్వారా సంక్షమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిస్వార్ధంగా ముందుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు పాల్గొని సర్పంచి దేవి సింగ్ కు శుభాకాంక్షలు తెలిపారు.



# జిల్లాలోని గత రెండు రోజులో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 106 మందికి కోర్టు శిక్షలు

**– జిల్లాలో గత రెండు రోజులో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 20 మందికి ఒక రోజు జైలు శిక్షతో పాటు ఒక్కోరికి రూ.1,000 జరిమానా**
**– డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో మరో 86 మందికి రూ.87,000 జరిమానా**
**–జిల్లా ఎస్పి యం.రాజేష్ చంద్ర**

**కామారెడ్డి ప్రతినిధి జనవరి 07. (ప్రజాజ్యోతి)**
జిల్లాలో మద్యం సేవించి వాహనం నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు ప్రత్యక్షంగానీ, పరోక్షంగానీ ప్రధాన కారణమవుతున్నారు. కొన్నిసార్లు మద్యం సేవించి వాహనం నడిపినవారు స్వయంగా ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతుండగా, ఎన్నో కుటుంబాలు దాని వల్ల రోడ్డున పడుతున్నాయి.
ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని కామారెడ్డి జిల్లా పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. పట్టుబడిన వాహనదారులను కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయమూర్తుల ఎదుట హాజరుచేయడం ద్వారా జైలు శిక్షలు లేదా జరిమానాలు విధించడం జరుగుతోంది.
జిల్లాలో గత రేడు రోజులో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో కోర్టు మొత్తం 106 మందికి శిక్షలు విధించింది:
కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్: 11 మందికి ఒక రోజు జైలు శిక్ష (?1000 జరిమానా ఒక్కోరికి)
దేవునిపల్లి పోలీస్ స్టేషన్: ఇద్దరికీ ఒక రోజు జైలు శిక్ష (?1000 జరిమానా ఒక్కోరికి)
మాచారెడ్డి పోలీస్ స్టేషన్: ఒక వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష (?1000 జరిమానా ఒక్కోరికి)
రామారెడ్డి పోలీస్ స్టేషన్: ఇద్దరికీ ఒక రోజు జైలు శిక్ష (?1000 జరిమానా ఒక్కోరికి)
దోమకొండ పోలీస్ స్టేషన్: ఒక వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష (?1000 జరిమానా ఒక్కోరికి)



తాద్వాయి పోలీస్ స్టేషన్: : ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష (?1000 జరిమానా ఒక్కోరికి)
జరిమానాల పరంగా, కామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో 27 కేసులకు రూ.27,000, దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 30 కేసులకు రూ.31,000, మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో 5 కేసులకు రూ.5,000, రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులకు రూ.2,000, బిక్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 07 కేసులకు రూ.7000, దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 కేసులకు రూ.4,000, బీబీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులకు రూ.3,000, సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 4 కేసులకు రూ.4,000, తాద్వాయి పోలీస్ స్టేషన్ 3 కేసులకు రూ.3000, రాజంపేట పోలీస్ స్టేషన్ ఒక కేసులకు రూ.1000 జరిమానాలు విధించబడ్డాయి. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మొత్తం 106 కేసులు నమోదు కాగా, వాటికి సంబంధించి మొత్తం రూ.1,07,000/– జరిమానాలు విధించబడ్డాయి.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, మాట్లాడుతూ:..
“మీ కుటుంబాన్ని, ఇతరుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనం నడపవద్దు. మీ నిర్లక్ష్యం వల్ల కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు, మరికొందరు వికలాంగులై జీవితాంతం బాధపడుతున్నారు. ఇకనైనా వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపకూడదు. మీరు గమ్యానికి సురక్షితంగా చేరుకోవడమే కామారెడ్డి జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం” అని జిల్లా ఎస్పీ తెలిపారు.

## హర్యానాలో కామారెడ్డి జిల్లా వాసి హత్య



**సదాశివనగర్ జనవరి 7 (ప్రజాజ్యోతి)**
కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన కటికే రజనీకాంత్ ను హర్యానాలో దుండగులు కిరాతకంగా హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసుల సహకారంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకు వస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

## అన్నారం గ్రామాభివృద్ధికి సహకరించాలి

**మండలాధికారులను సన్మానించిన నూతన పాలకవర్గం**





**రాజంపేట జనవరి 7 (ప్రజాజ్యోతి)**
రాజంపేట మండలంలోని అన్నారం గ్రామ సర్పంచ్ ముత్యాల రవీందర్, ఉపసర్పంచ్ ధర్పల్లి సతీష్ రెడ్డి బుధవారం మండలాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ జానకి, డిప్యూటీ తహసిల్దార్ శృతి, మండల అభివృద్ధి అధికారి బాలకృష్ణ, ఎస్ఐ ఎన్. రాజులను సన్మానించి గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అన్నారం గ్రామపంచాయతీకి స్థలం కేటాయింపుతో పాటు నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. కామారెడ్డి డిపో నుంచి వయా రాజంపేటఉఆర్గొండ అన్నారం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, గ్రామంలో వీధిదీపాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని మండల అధికారులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రామ్ నివాస్, నాలుగో వార్డు సభ్యుడు శ్రీశైలం, ఏడవ వార్డు సభ్యుడు బర్కం శ్యాంసుందర్, ముత్యాల సాయికుమార్, ముత్యాల సంగయ్య, కీసరి రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఆపిశెట్టి ప్రదీప్ పటేల్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం




## సర్పంచ్ అరిగే ధర్మతేజ



**బాన్సువాడ/బీర్కూర్ ఆర్ సి జనవరి 07 (ప్రజా జ్యోతి)**
బీర్కూరు మండల కేంద్రంలో ఆపిశెట్టి ప్రదీప్ పటేల్ స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను బీర్కూర్ గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపిశెట్టి ప్రదీప్ పటేల్ ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ, యువతలో చురుకైన వ్యక్తిగా మంచి గుర్తింపు పొందారని తెలిపారు. ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మెలుగుతూ, స్నేహశీలిగా ఉండే ప్రదీప్ పటేల్ అకాల మరణం బీర్కూరు యువతను తీవ్రంగా కలచివేసిందన్నారు.అతని సేవలను స్మరించుకుంటూ, యువత ఐక్యతకు ప్రతీకగా ఆయన పేరిట ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా, సామాజిక బాధ్యతను కూడా గుర్తుచేస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సందీప్ పటేల్, యువజన నాయకులు మియాపూర్ శశికాంత్, ప్రశాంత్, రాకేష్, ప్రేమ్ సాగర్, సంతోష్, సాయి,, భవాని, బాలరాజ్, శివ, రాజు, కృష్ణతో పాటు పలువురు యువకులు, క్రీడాభిమానులు పాల్గొని టోర్నమెంట్‌లో పాల్గొన్నారు.

## మంగ్లూర్ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటు

**నిజాంసాగర్ ప్రజాజ్యోతి జనవరి 6**
నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం గ్రామ సర్పంచ్ సర్వల రాజు ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీకాంత్ శర్మ వేద మంత్రోచ్ఛారణల మధ్య భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ఆదర్శాలు గ్రామాభివృద్ధికి, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు

**సదాశివనగర్ జనవరి 7 (ప్రజాజ్యోతి)**
సదాశివనగర్ మండలం యాచారం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు లచ్చిరాం నాయక్ సతీమణి అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకొని ఆ కుటుంబాన్ని బిఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాదులో వైద్యశి చేయించుకొని ఇంటికి తిరిగి రావడంతో బుధవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ జెడ్పిటిసి పడిగేల రాజేశ్వరరావు, సీనియర్ నాయకులు విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు దొడ్లే రవి, మంగ్యా నాయక్, మైనార్టీ జిల్లా నాయకుడు దస్తగిరి, మాజీ ఎంపీటీసీ మంగ్యా నాయక్, ఉత్తనూర్ పార్టీ అధ్యక్షుడు గుడ్ల శ్రీకాంత్, రమేష్ నాయక్, పబ్బ సంజీవ్, వెంకట్రావు, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



# సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

**సదాశివనగర్ జనవరి 7 (ప్రజాజ్యోతి)**

సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సురేందర్ రెడ్డి బ్యాంకు అధికారులతో కలిసి నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. సందర్భంగా మేనేజర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో గ్రామపంచాయతీ పాలకవర్గం కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ చేసేందుకు పంచాయతీ సహకారం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, రుణాల సద్వినియోగంపై బ్యాంకు లో లావాదేవీలను మహిళా సంఘాల గురించి, క్రాప్ లోన్స్, ఇన్సూరెన్స్ ల గురించి వివరించారు. బ్యాంక్ అధికారులకు సర్పంచ్లు, ఉప సర్పంచ్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్నూర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ రాజయ్య, వజ్జపల్లి సర్పంచ్ శ్యామ్ రావు రాధా బాయ్, ఉప సర్పంచ్ నర్సయ్య, తిమ్మాజివాడి సర్పంచ్ భవాని సాయిలు, ఉప సర్పంచ్ రవీందర్, తుక్కోజీవాడి సర్పంచ్ సంగరావు, ఉప సర్పంచ్ రాజయ్య, యాచారం సర్పంచ్ గణేష్, ఉప పరశురాం, పూర్యా నాయక్ తండా సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, లక్ష్మ నాయక్ తండా మోహన్ ప్రమీల, ఉప




సర్పంచ్ సరిచంద్, బూర్గుల్ సర్పంచ్ మోహన్, కరకవాడీ సర్పంచ్ సుధాకర్, యాచారం మాజీ ఎంపీటీసీ సురేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## పోడు భూముల రైతుల సమస్యలను నేరుగా రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌కు వినిపించాలి

**గాంధారి, జనవరి 7 (ప్రజాజ్యోతి)**

గిరిజన పోడు భూముల రైతుల సమస్యల పరిష్కారానికి సంబంధించి గాంధారి మండల పరిధిలోని రైతులు, గిరిజనులు భారీ సంఖ్యలో పాల్గొని తమ గోడును నేరుగా రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌కు విన్నవించుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు బొట్టు మోతి రావు నాయక్ పిలుపునిచ్చారు.గాంధారి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు గిరిజన పోడు భూముల సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ శ్రీ కోదండరామిరెడ్డి, ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సురేందర్ రాథోడ్ తదితరులు గాంధారికి విచ్చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పోడు భూములతో సంబంధం ఉన్న ప్రతి రైతు, గిరిజనుడు ఈ సభకు హాజరై తమ సమస్యలను నేరుగా కమిషనర్‌కు తెలియజేయాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో నాగ్లూర్ సర్పంచ్ సంతోష్ నాయక్, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సర్దార్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం యూత్ జనరల్ సెక్రటరీ కేకే రవి, జనరల్



సెక్రటరీ దశరథ నాయక్, మండల యూత్ అధ్యక్షుడు సురేందర్, జనరల్ సెక్రటరీ పందరి, అధ్యక్షుడు జగ్మాల్ నాయక్, ఆర్గనైజేషన్ సెక్రటరీ జేత్రం, ఉపాధ్యక్షులు సీను నాయక్, కర్నం గడ్డ శ్రీనివాస్, గణేష్ నాయక్, జనరల్ సెక్రటరీలు రాందాస్ నాయక్, దేవుల నాయక్, బాలకృష్ణ, ఇందల్ నాయక్, శ్రీకాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# మరో ఉద్యమానికి ఊపిరి పొయ్యొద్దు

-మమ్మల్ని బ్రతకనివ్వండి రసాయన పరిశ్రమలు మాకు వద్దు
-గ్రామపంచాయతీ తీర్మానంతో తరలివచ్చిన కంచర్ల గ్రామ ప్రజలు
- ఎమ్మెస్ ఎన్ కంపెనీని మూసి వేస్తూ, కొత్త పరిశ్రమ అనుమతిని రద్దు చేయాలి

**భిక్కనూరు, జనవరి 7 (ప్రజాజ్యోతి)**

భిక్కనూరు మండలం లో నూతన రసాయన పరిశ్రమ ప్రజా సేకరణలో భాగంగా కంచర్ల గ్రామ సర్పంచ్ గొల్ల అరుణ స్వామి యాదవ్, ఉప సర్పంచ్ ఆశ రమేష్, వార్డ్ మెంబర్లు అదేవిధంగా గ్రామంలోని యువతతో పాటు, రైతులు పెద్ద ఎత్తున రసాయన పరిశ్రమ సుమతికి వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమానికి హాజరై కార్యక్రమానికి హాజరై, శాంతియుతంగా నిరసన తెలుపుతూ, పరిశ్రమ అనుమతికి ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని పాత ఎంఎస్ఎన్ కంపెనీ నీకు కూడా మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ



కార్యక్రమానికి విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరై ప్రాణాలను హరించే ఫ్యూసెన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి రసాయన పరిశ్రమలకు అనుమతి ఇవ్వకూడదని భవిష్యత్తులో మరే ఇతర రసాయన కంపెనీని మండలంలోకి అనుమతించకూడదని జాయింట్ కలెక్టర్ విక్టర్, పర్యావరణ పరిరక్షణ అధికారుల సమక్షంలో మండలంలోని 18 గ్రామాల ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, యువకులు, రైతులు, గ్రామస్తులు భారీ నిరసన తెలిపారు

## గ్రూప్-3 ఉద్యోగం సాధించిన యువకిడి సన్మానం

**ఎల్లారెడ్డి, జనవరి-7(ప్రజా జ్యోతి)**

ఇటీవల గ్రూప్ఊ3 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మహమ్మద్ ఖాలెద్ బుధవారం ముస్లిం వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఎస్సీ దెవలప్‌మెంట్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా హైదరాబాద్ సెక్రటేరియట్‌లో ఉద్యోగం పొందిన మహమ్మద్ ఖాలెద్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించడం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు గయాజొద్దీన్, వైస్ ప్రెసిడెంట్లు ముక్రమ్ అలీ, సయ్యద్ మీర్, ముబీన్, క్యాషియర్ హైమద్, జాయింట్ సెక్రటరీ హైమద్ పాషా పాల్గొన్నారు. అలాగే కమిటీ సభ్యులు సాధిక్, మహమ్మద్ నయీమ్, మక్సూద్, జాహీర్, అంజత్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.



## డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 7**

బీబీపేట మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న శృతిని బదిలీ చేస్తూ మంగళవారం రాత్రి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శృతిని రాజంపేట మండలానికి బదిలీ చేశారు. అదే సమయంలో రాజంపేట మండలం నుంచి డిప్యూటీ తహసిల్దార్ సంతోషిని బిక్నూర్ మండలానికి నియమిస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలతో బీబీపేట మండలంలో తాసిల్దార్ కార్యాలయంలో పరిపాలనా మార్పులు చోటు చేసుకొన్నాయి. కొత్త అధికారుల నియామకంతో కార్యాలయ పనితీరు మరింత మెరుగుపడి భూ సంబంధిత సేవలు, ధ్రువపత్రాల జారీతో పాటు ఇతర రెవెన్యూ పనులు తొందరగా జరుగుతాయని ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఇద్దరికీ జైలు శిక్ష

ఎస్సై పి. రాజశేఖర్

**రామారెడ్డి జనవరి 07 (ప్రజా జ్యోతి)**

రామారెడ్డి మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా ఎం. బాల్ నర్సింలు(55) గ్రామం భవానిపేట్ మండలం మాచారెడ్డి, మరొకరు రమావత్ రమేష్ (32) గ్రామం దొనకల్ మండలం ఇందల్వాయి గల వ్యక్తులను కోర్టులో హాజరుపరచగా కామా రెడ్డి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ టీ. చంద్రశేఖర్ ఒకరోజు జైలు శిక్ష వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై పి.రాజశేఖర్ తెలిపారు.



# నూతన సర్పంచులను సన్మానించిన అధికారులు



**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 7**

బీబీపేట మండల కేంద్రంలో మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్రోదయ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులను శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి పూర్ణ చంద్రోదయ కుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ అభివృద్ధికి గ్రామ సర్పంచ్ లు పాటుపడాలని మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమన్వయంగా ఉండి మన బీబీపేట మండలాన్ని కామారెడ్డి జిల్లాలోని ఉన్నత స్థానంలో ఉంచాలని తెలియ చేశారు. ఇట్టి కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి పూర్ణచంద్రోదయ కుమార్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఏపీవో అబ్బు గౌడ్, బిబిపేట్ గ్రామ సర్పంచ్ ఉప్పల సాత్విక సాయి, జనగామ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, మల్కాపూర్ సర్పంచ్ నాగరాజు, యాడారం సర్పంచ్ గొబ్బూరి సుధారాణి, మందాపూర్ సర్పంచ్ హరీష్, ఇస్సానగర్ సర్పంచ్ రాజా గౌడ్, ఉప్పర్ పల్లి సర్పంచ్ మమత, తుజాల్ పూర్ సర్పంచ్ ప్రవిత , కోనాపూర్ సర్పంచ్ రాజేష్ , రాంరెడ్డిపల్లి సర్పంచ్ ధరణి లక్ష్మ, షేరీ బీబీపేట్ సర్పంచ్ దేవయ్య,మరియు మండల అభివృద్ధి కార్యాలయంలోని సిబ్బంది పాల్గొన్నారు.

# ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు ఆహ్వానం

**గాంధారి, జనవరి 7 (ప్రజాజ్యోతి)**
స్వాతంత్ర్య సమరయోధుడు, వడ్డెర్ల సమాజానికి ఐకాన్‌గా గుర్తింపు పొందిన ఒడ్డె ఓబన్న 219వ జయంతి వేడుకలను ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో బుధవారం జయంతి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఆహ్వానాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు ఉత్సవ కమిటీ సభ్యులు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ ఒడ్డె ఓబన్న త్యాగాలు, సేవలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొంటూ, జయంతి వేడుకలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్, ఉత్సవ కమిటీ చైర్మన్ జరిపాటి జైపాల్, కమిటీ సభ్యులు గుంజ కిషన్, వడ్డెర్ల లక్ష్యసాధన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జరిపాటి సత్యనారాయణ రాజు, వడ్డెర సంఘం తెలంగాణ గన్నుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య, చెన్నాపురం సర్పంచ్ సంపంగి నాగయ్య, నిజామాబాద్ జిల్లా వడ్డెర సంఘ అధ్యక్షుడు ఒల్లెపు వెంకట్, నిర్మల్ జిల్లా వడ్డెర సంఘ అధ్యక్షుడు ఒల్లెపు శివభూపతి, అలకుంట ప్రశాంత్‌తో పాటు పలు జిల్లాల వడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈ జయంతి వేడుకలకు ప్రజలు, వడ్డెర్ల సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు.



# మాల్తుమ్మెద ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



**నాగిరెడ్డి పేట్, జనవరి 7 (ప్రజాజ్యోతి):**
మండలంలోని మాల్తుమ్మెద బాలురు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో బుధవారం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ పాఠశాలను సందర్శించారు. భోజనం వికటించేందుకు గల కారణాలను గ్రామస్థులకు అడిగి తెలుసుకున్నారు. చికిత్స అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో, వారి తల్లి తండ్రులతో మాట్లాడి మనో ధైర్యాన్ని నింపి అండగా ఉంటామని భరోసా కల్పించారు. పాఠశాల ఆవరణలో గల వంట గది, పరిసరాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో గల మంచి నీటి ట్యాంక్ ను పరిశీలించగా చనిపోయిన కప్పు అవశేషాలు కుళ్లిపోయి నీటిలో కనిపించాయని ఈ నీటిని వంట వండడం కోసం ఉపయోగిస్తారని, పిల్లలకు తాగునీరు కూడా ఉపయోగిస్తారని తెలుపడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల పరిస్థితుల గురించి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఒకే తరగతిలో 54 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని, మిగతా భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని వాటికీ మరమత్తులు చేపట్టి ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా విద్యాధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధయ్య, నాయకులు సాయిబాబా, దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ నారాయణ, దుర్గేష్, నాయికోటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవికి మూడు పార్టీల పోటీ

**రాజంపేట జనవరి 7 (ప్రజా జ్యోతి)**
రాజంపేట మండల సర్పంచుల ఫోరం ఎన్నిక రసవత్తరంగా మారింది. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులే అధిక సంఖ్యలో ఉండటంతో, ఫోరం అధ్యక్ష పదవిని తమ ఖాతాలో వేసుకోవాలని అధికార పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఇద్దరు, ఇండిపెండెంట్‌గా ఒకరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు సర్పంచులు గెలుపొందగా, మిగిలిన సర్పంచులంతా కాంగ్రెస్ పార్టీకి చెందినవారే. బీఆర్ఎస్ పార్టీ తరఫున రాజంపేట మండల కేంద్ర సర్పంచ్ దుబ్బని శ్రీకాంత్ అధ్యక్ష పదవికి ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే అర్గొండ గ్రామ సర్పంచ్ ఎర్ర వికాస్ రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రేసులో ఉన్నారు. ఇదిలా ఉండగా, సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవిని కాషాయం రంగులోకి మార్చేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీకి సంఖ్యాబలం ఉన్నప్పటికీ, అధ్యక్ష పదవిని ఎలాగైనా చేజిక్కించుకోవాలనే ధీమాతో మూడు పార్టీల సర్పంచులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈసారి మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులంతా యువ నాయకులే కావడం విశేషం. ఈ నేపథ్యంలో ఫోరం కమిటీలో కీలక పదవులన్నీ కాంగ్రెస్ సర్పంచులకే దక్కేలా పార్టీ అధిష్టానం కసరత్తులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అధ్యక్ష పదవి రేసులో పెద్దాయిపల్లి సర్పంచ్ నరేష్ పేరు ముందుగా వినిపిస్తోంది. మొత్తానికి రాజంపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవికి మూడు పార్టీల మధ్య పోటీ నెలకొనడంతో రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారింది. చివరికి అధ్యక్ష పదవిని ఎవరు దక్కించుకుంటారన్నది వేచి చూడాల్సిందే.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

**ఎల్లారెడ్డి, జనవరి-7 (ప్రజా జ్యోతి)**
గ్రామ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో ఆరోవ రోజు ఎల్లారెడ్డి మండలంలోని అడవిలింగల్ గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మనారాయణ, గ్రామ సర్పంచ్ మంగలి సంతోష్ కుమార్ ప్రారంభించారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు పాల్గొని గ్రామస్తులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు హాజరై 40మందికి తమ కంటి సమస్యలను పరీక్షించుకున్నారు. దృష్టిలోపం, కంటి ఒత్తిడి, ముత్యబిందు వంటి సమస్యలపై వైద్యులు అవగాహన కల్పించి అవసరమైన వారికి ఉచిత మందులు అందజేశారు. కొందరిని తదుపరి చికిత్స కోసం ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చురుకుగా పాల్గొని శిబిరం సజావుగా నిర్వహించేందుకు సహకరించారు. గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అభినందించారు. గ్రామస్తులు ఎన్ఎస్ఎస్ యూనిట్‌కు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఇంచార్జ్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ కోదండరామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



**గాంధారి, జనవరి 7 (ప్రజాజ్యోతి)**
గాంధారి మండలంలోని తిప్పారం తాండాలో నిర్మాణంలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ కోదండరామచంద్ర స్వామి ఆలయం నిర్మాణానికి భక్తులు విరాళాలతో ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామం చద్మల్ తాండాకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ మంజ విజయమల తండ్రి పత్తె సింగ్ తన వంతు సహాయంగా రూ.5,555/-లను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం శ్రీ శ్రీ శ్రీ కోదండరామచంద్ర స్వామి వారి మరియు చిన్నజీయర్ స్వామి వారి మంగళాశీస్సులు దాత కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. తిప్పారం తాండా గ్రామ ప్రజల తరఫున దాతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరెందరో భక్తులు ఈ పవిత్ర కార్యానికి సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

# నేడు గాంధారిలో పోడు భూములపై గిరిజన రైతులతో సమావేశం

## తహసీల్దార్ రేణుక చౌహాన్



**గాంధారి, జనవరి 7 (ప్రజాజ్యోతి)**
గాంధారి మండల కేంద్రంలో నేడు ఉదయం 10 గంటలకు తెలంగాణ వ్యవసాయ మరియు రైతు సంక్షమ కమిషన్ చైర్మన్ యం.కోదండరెడ్డి అధ్యక్షతన కామారెడ్డి జిల్లాలోని పోడు భూములు మరియు వాటి సమస్యలపై గిరిజన రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రేణుక చౌహాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సమావేశం గాంధారి మండల కేంద్రంలోని మారుతి ఫంక్షన్ హాల్లో జరుగుతుందని, పోడు భూములతో సంబంధం ఉన్న గిరిజన రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు, సూచనలు నేరుగా కమిషన్ చైర్మన్‌కు వినిపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా సంబంధిత రైతులు, గిరిజనులు అందరూ తప్పనిసరిగా హాజరై ఈ సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు

## మహిళ అభివృద్ధి ధ్యేయంగా

**భిక్కనూరు, జనవరి 7 (ప్రజాజ్యోతి)**
భిక్కనూరు మండలంలోని అంతంపల్లి గ్రామంలో బుధవారం 1000 నాటు కోళ్లతో మదర్ యూనిట్ ప్రారంభించడం జరిగింది. దీనికి మూడు లక్షల రూపాయలు బిక్కనూరు మండల సమైక్య గ్రామ సంఘం అంతంపల్లి శ్రీ గురుదత్త గ్రూప్ సభ్యురాలు నిహారిక లబ్ధిదారులకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంతంపల్లి సర్పంచ్ మంజుల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ, పదిమందికి జీవనోపాధి కల్పించే విధంగా మహిళల అభివృద్ధి జరగాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం ఆర్ సురేష్ కుమార్, ఏ పి ఎం ఆర్ సాయిలు, పిసి స్వాతి, ప్రమోద్ రెడ్డి పాల్గొన్నారు.



# ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గోపిశెట్టి రాంబాబు





## అటుట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

**నిజామాబాద్ రూరల్, జనవరి 7 (ప్రజా జ్యోతి):**
తెలంగాణ విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగం ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఆచార్య గోపిశెట్టి రాంబాబు బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరిరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అటుట్ ఆధ్వర్యంలో ఆచార్య గోపిశెట్టి రాంబాబు గారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.
సన్మాన కార్యక్రమంలో ఆచార్య రాంబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సీనియర్ ఆచార్యులు, అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, నాన్‌టీచింగ్, ఔట్సోర్సింగ్ సిబ్బంది అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మీ అందరి సహకారంతో ప్రిన్సిపాల్ బాధ్యతలను ఎటువంటి ఒడిదొడుకులు లేకుండా సమర్థవంతంగా నిర్వహిస్తాను అని హామీ ఇచ్చారు.వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఆచార్య గోపిశెట్టి రాంబాబు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. సీనియర్ ఆచార్యులుగా సమిష్టి కృషితో కళాశాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంట చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణ అధికారి కె. సంపత్ కుమార్, యూజీసీ డైరెక్టర్ ఆంజనేయులు, ఆర్ట్స్ డీన్ కె. లావణ్య, ఆచార్య అపర్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ ఆరతి, భ్రమరాంబిక, వాణి, నందిని, శాంతాబాయి, కైసర్ మహమ్మద్, అతి సుల్తాన్ గోరి, మహమ్మద్ అబ్దుల్ ఖవి, మహమ్మద్ జమీల్ అహ్మద్, సాయిలు, మూసా ఖురేషి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.
అలాగే వివిధ విభాగాల అధిపతులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఔట్సోర్సింగ్ సిబ్బంది, అసోసియేషన్ సంఘాల ప్రతినిధులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి



**బిక్కనూరు,జనవరి 7 (ప్రజాజ్యోతి)**
భిక్కనూరు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి దివ్య ఆదేశాలతో అమ్మ ఒడి, సికిల్ సెల్, అనీమియా స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

**ఈనెల 21వ తేదీన చివరి గడువు**
**ఫిబ్రవరి 21న ప్రవేశ పరీక్ష నిర్వహణ**




**ఇందల్వాయి, జనవరి 07,( ప్రజా జ్యోతి న్యూస్):**
రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులల్లో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని గిరిజన సంక్షమ గురుకుల విద్యాలయ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ గంగారం నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులు ఈనెల 21వ తేదీలోపు ఆన్లైన్లో దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 4,5,6,7,8 తరగతిలో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆయన అన్నారు. పూర్తి వివరాలు కోసం ఆన్లైన్లో వివరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

# 450 పై చిలుకు మంది ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు.



## వెల్నెస్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ అసద్ ఖాన్



**రెంజల్, జనవరి 07(ప్రజాజ్యోతి ):**
రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల రైతు వేదికలో బుధవారం రోజున వెల్నెస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్నెస్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ అసద్ ఖాన్ మాట్లాడుతూ రెంజల్ మండలంలోని సాటాపూర్ గ్రామంలో గల రైతు వేదికలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని ఇందులో భాగంగానే మండలంలో గల పలు గ్రామాల నుండి 450 పైచిలుకు మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. 250 మందికి పైగా ఫ్యామిలీ కార్డులను కూడా అందజేశామన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోబిన్ ఖాన్ మాట్లాడుతూ సాటాపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన వెల్నెస్ హాస్పిటల్ యాజమాన్యానికి మండల ప్రజల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వెల్నెస్ ఆసుపత్రి యాజమాన్యం అయినటువంటి అసాద్ ఖాన్, సుమన్ గౌడ్, వివేక్ వీరు ముగ్గురు చదువుకున్నది ఇంజనీరింగ్ అయినా పేద ప్రజలకు ఏదో రకంగా ఉపయోగపడాలన్న ముఖ్య ఉద్దేశంతో వైద్య రంగాన్ని ఎంచుకొని పేద ప్రజలకు వైద్య సేవలను అందించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు సుహాసినినితిన్, ఉప సర్పంచ్, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఏకార్ పాషా, మాజీ సర్పంచ్ జావిదోద్దిన్,ఆయా గ్రామాల సర్పచులు, ఉపసర్పంచ్ లు గ్రామ పెద్దలు, కుర్మా సాయిలు,పిట్ల మధు, హాజీ ఖాన్, సాయిలు, గంగారాం,రవి, ఇమ్రాన్ ఖాన్, పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు ఫాగింగ్

**కమ్మర్ పల్లి జనవరి 7,ప్రజా జ్యోతి.**
కమ్మర్ పల్లి మండలం హాసకోత్తూర్ గ్రామంలో బుధవారం రోజున దోమల నివారణకై మలతియన్ మందును వినియోగించి ఫాగింగ్ చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ నలిమేళా రేవతి గంగా రెడ్డితెలిపారు.ఉప సర్పంచ్ ఏనుగు మనోహర్,వార్డ్ సభ్యులు కుందేటి శ్రీనివాస్,రాధరపు గంగాధర్,పంచాయతీ కార్యదర్శి బి.నవీన్ గౌడ్ గారలు పాల్గొన్నారు



# ములుగు జిల్లాలో గాంధారి విద్యార్థులకు తప్పిన ప్రమాదం

**గాంధారి, జనవరి 7 (ప్రజాజ్యోతి)**
ములుగు జిల్లాలో టూరిస్టు బస్సుకు పెను ప్రమాదం తప్పింది. కామారెడ్డి జిల్లాలోని గాంధారి మండలానికి చెందిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రయాణిస్తున్న టూరిస్టు బస్సు, ఇంచర్ల ఫంక్షన్ హాల్ సమీపంలో అదుపుతప్పి ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది.ప్రమాద సమయంలో బస్సును డ్రైవర్ మద్యం మత్తులో నడిపినట్లు విద్యార్థులు ఆరోపించారు. సమాచారం మేరకు బస్సులో మొత్తం 53 మంది విద్యార్థులు ఉన్నారని, అప్రమత్తత వల్ల వారు అందరూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని తెలిపారు.ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





# మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షురాలిని సన్మానించిన గ్రంథలయ చైర్మన్

## అంతిరెడ్డి రాజి రెడ్డి

**రెంజల్, జనవరి 07(ప్రజాజ్యోతి ):**

రెంజల్ మండలంలోని ఇటీవల నూతనంగా ఎన్నికైనటువంటి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు సాటాపూర్ సర్పంచ్ సుహాసినినితిన్ ను బుధవారం రోజున గ్రంథలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి సాటాపూర్ గ్రామంలో గల తన స్వగృహంలో సర్పంచ్ సుహాసిని నితిన్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సర్పంచ్ సుహాసిని గ్రంథాల చైర్మన్ శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రంథాల చైర్మన్ అంతి రెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ మండలంలో గల సర్పంచుల సమస్యలు పరిష్కరిస్తూ వాటితోపాటు గ్రామంలో గల సమస్యలు పరిష్కరిస్తూ, గ్రామాభివృద్ధికై అహర్నిశలు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సర్పంచ్ మాధవ్,నీలా సర్పంచ్ యోగేష్, ఏఎంసి డైరెక్టర్



అంజయ్య, మాజీ ఉపసర్పంచ్ సాయిలు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిరణ్, గ్రామస్తులు అనిల్, దేవీలాల్, అంజాద్, స్వామి,ఇమామ్, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు తాడిబిలోలి విద్యార్థి ఎంపిక

**రెంజల్, జనవరి 07(ప్రజాజ్యోతి ):**



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిర్మన్ పల్లి గ్రామంలో నెట్ బాల్ పోటీలకు ఎంపికలు జరిగాయి. ఇందులో భాగంగానే తాడిబిలోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జాదవ్ వెంకటేష్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి నెట్బల్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేఖ మాట్లాడుతూ తాడిబిలోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి నెట్బాల్ పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణంగా ఉందని తెలియజేస్తూ ఈనెల 16, 17 తేదీలలో ఖమ్మంలో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలలో జాదవ్ వెంకటేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీకి ఎంపికైన వెంకటేష్ జాదవ్ ను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పి ఈ టి కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ట్రాన్స్ స్పెసిఫిక్ ఇండియా నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

సిరికొండ మండల కేంద్రంలో ట్రాన్స్ స్పెసిఫిక్ ఇండియా నూతన క్యాలెండర్ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిన్న వాల్గట్ సర్పంచ్ గణేష్, ఉప సర్పంచ్ రోండ్ల గోవర్ధన్, మాజీ సర్పంచులు సిరికొండ రవిశంకర్, కొండాపూర్ రమేష్ల మధ్యన ట్రాన్స్ స్పెసిఫిక్ ఇండియా డైరెక్టర్ గోపిడి గంగారెడ్డి క్యాలెండర్ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా గోపిడి గంగారెడ్డి మాట్లాడుతూౌ సాయి రెడ్డి గత ఆరు నెలలుగా ట్రాన్స్ స్పెసిఫిక్ ఇండియాకు బిజినెస్ డెవలప్మెంట్ పార్ట్నర్గా సేవలందిస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి 28న న్యూజిలాండ్లోని ఆల్ కాలేజ్ యూనివర్సిటీలో నర్సింగ్ కోర్సుకు ట్రాన్స్ స్పెసిఫిక్ ఇండియా ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఫిబ్రవరి 28న హైదరాబాద్ దిల్షిషిప్ నగర్ కర్కో థియేటర్ ఎదురుగా ఉన్న ట్రాన్స్ స్పెసిఫిక్ ఇండియా కార్నర్లో సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే ఫిబ్రవరి 12న నిజామాబాద్లో నిర్వహించే అవగాహన సదస్సుకు సిరికొండ మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, నిజామాబాద్ రూరల్ మండలాల్లోని విద్యార్థులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



# సర్పంచ్ ఆధ్వర్యంలో వైకుంఠధామంలోని పిచ్చి మొక్కల తొలగింపు.



**రెంజల్, జనవరి 07(ప్రజాజ్యోతి ):**

రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామంలో గల వైకుంఠ దామంలో గత మూడు సంవత్సరాల నుండి పిచ్చి మొక్కలు ఎపుగా పెరగి గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో అది గమనించిన సర్పంచ్ ధనురి నర్సవ్వ అబ్బయ్య ఆ పిచ్చి మొక్కలను తొలగించి వైకుంఠధామం చదునుగా చేయించి గ్రామ ప్రజల రాకపోకలకు వీలుగా చేయించారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ రఫిక్, గ్రామపంచాయతీ కార్యదర్శి సల్మాన్ వార్డ్ మెంబర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఈఓ తీరుపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు



**బోధన్ జనవరి 07 (ప్రజాజ్యోతి)**

పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను వేధించడం తగదని పీఆర్టీయూ, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘాలు స్పష్టం చేశాయి. ఎడపల్లి మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. కుర్నపల్లి గ్రామంలోని వడ్డర కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఏకోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న భూపతి రాజుపై ఎంఈఓ దాడి ఆరోపణలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఒక్కడే ఉపాధ్యాయుడిగా అన్ని బాధ్యతలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడిపై ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు. స్వయంగా సెల్ఫోన్ను ధ్వంసం చేసి, ఆ ఘటనను ఉపాధ్యాయుడిపై మోపడం సరికాదని విమర్శించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే జిల్లా విద్యాశాఖ అధికారులకు లేదా కలెక్టర్కు తెలియజేయాల్సి ఉండగా, నేరుగా పోలీస్ స్టేషన్ను ఆశ్రయించడం వెనుక ఉద్దేశాలు అనుమానాస్పదంగా ఉన్నాయని సంఘ నాయకులు వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేసే విధంగా అధికారుల వ్యవహారం కొనసాగితే సహించబోమని హెచ్చరించారు. ఈ ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి నిజాలను వెలికి తీయాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే జిల్లా స్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పీఆర్టీయూ, ఎస్టీయూ నాయకులు స్పష్టం చేశారు.

# కేజీబీవీలో సబ్కలెక్టర్ ఆకస్మిక తనిఖీ.

**బోధన్ జనవరి 07 (ప్రజాజ్యోతి)**

ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం బోధన్ సబ్కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన, రికార్డులు, స్టోర్రూమ్, వసతి గదులు, మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న ఆహారం, వసతి, భద్రతా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పరిశుభ్రత, భద్రత, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల ప్రిన్సిపల్ దీపికకు ఆదేశాలు జారీ చేశారు.

బాలికల విద్యలో కేజీబీవీల పాత్ర కీలకమని పేర్కొన్న సబ్కలెక్టర్, విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తాసిల్దార్ దత్తాద్రి సహా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ స్థలంపై వివాదం.. ఎంఎస్సీ పారం గ్రామంలో ఉద్రిక్తత

**బోధన్ జనవరి 07 (ప్రజాజ్యోతి)**

ప్రభుత్వ స్థలం కేటాయింపు అంశం ఎడపల్లి మండలం ఎంఎస్సీ పారం గ్రామంలో రాజకీయ ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామ సర్పంచ్ నోముల జయశ్రీ, ఉపసర్పంచ్ బషీర్ల మధ్య నెలకొన్న విభేదాలు బుధవారం తీవ్రస్థాయికి చేరుకున్నాయి. గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో మహిళా భవనం నిర్మాణం చేపట్టాలని డ్వాక్రా మహిళలు కోరడంతో ఈ వివాదం మొదలైంది. ఈ మేరకు రూ.10 లక్షల వ్యయంతో మహిళా భవనం నిర్మించేందుకు గ్రామపంచాయతీ సమావేశంలో తీర్మానం చేసినట్లు సర్పంచ్ జయశ్రీ తెలిపారు. అయితే, భవనం నిర్మాణానికి కేటాయించే స్థలాన్ని తీర్మానంలో స్పష్టంగా పేర్కొనలేదని ఉపసర్పంచ్ బషీర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలం తన ఇంటికి వెళ్లే మార్గమని, అక్కడ మొరం వేయించడాన్ని తాను వ్యతిరేకించానని ఉపసర్పంచ్ తెలిపారు. ఈ అంశంపై ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, పరిస్థితి తోపులాట వరకు వెళ్లింది. సమాచారం అందుకున్న ఎడపల్లి పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరువర్గాలను శాంతింపజేసిన అనంతరం పోలీస్ స్టేషన్కు రావాలని సూచించారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్ ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటన నేపథ్యంలో ఎంఎస్సీ పారం గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పోలీసులు పరిస్థితిని పర్యవేక్షస్తున్నారు.

